# నీ తోడిదే లోకం

**పుట్టినవాడు గిట్టక తప్పదు. ఇది జగమెరిగిన సత్యం. ఎలాగూ మరణం తప్పదు కదా, పోనీ బ్రతికినన్నాళ్ళు సక్రమంగా, పరోపకారం చేస్తూ బ్రతికి పోదాం అనుకోదు మనిషి. అసూయ, ద్వేషం, ప్రతీకారం, ఆశ, అనుబంధాలు, మొదలైన ప్రకోపాలతో ఉడికిపోతూ, జీవితంలో రగిలిపోతూ అకస్మాత్తుగా భగవంతుడి నుండి పిలుపురావడంతో, ఎవరికీ చెప్పకుండా, ఇవన్నీ వదిలిపెట్టి వెళ్ళిపోవడం జరుగుతూంటుంది.**

ఆ ఇల్లు శోకసముద్రంలా ఉంది. ఎత్తు అరుగుల ఇల్లు. ఇక అరుగుమీద, ఒక స్త్రీ శరీరం నిర్జీవంగా. తల దగ్గర జ్యోతి వెలుగుతూంది సువాసనకు అగరవత్తుల పొగ వెలువడుతూంది. తలవేపు భర్త శంకరం. అతని మేనత్త శంకరాన్ని ఆనుకుని అతని మేనత్త కూతురు మణి, కూర్చొనివున్నారు. చుట్టూ బంధువర్గం. ఎవరికి తోచిన కబుర్లు వాళ్ళు చెప్పుకుంటున్నారు. మరో అరుగు చివర్లో ఒక పనిపిల్లవాడిలో కూర్చున్న ఒక పాప వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఆ పాప శంకరం ఏకైక కూతరు.

చిన్నారి పాప బుగ్గలనిండా కన్నీటి చారలు తెల్లవారుఝామున తల్లిపోతే, పొద్దున్నే తల్లి దేముడి దగ్గరకు వెళ్ళిందనీ, తను పెద్దయ్యాక వస్తుందనీ చెప్పారు. అప్పటినుండీ ఏడుస్తూనే వుంది. బూరెల్లాంటి బుగ్గలు, మెరిసే కళ్ళు, ఆ కళ్ళనిండా సప్త సముద్రాలు పొంగడానికి సిద్ధంగా వున్నాయి. గిరజాల జుట్టు, పుష్టిగా ఎట్టిగా ఉంది. పాప ముఖం నిండా దుఃఖం గూడు కట్టుకుని వుంది. ఎవరైనా పలకరిస్తే చాలు, గుండె పగిలిపోయేలా ఏడిచేట్లుగా వుంది ఆ పాప పరిస్థితి.

అమ్మ దేముడి దగ్గరకు వెళ్ళిందా?

ఎందుకు వెళ్ళింది?

తను అమ్మ మాట వినడం లేదని వెళ్ళిపోయిందా?

రోజూ పొద్దున్నే నీళ్ళోసుకోవడం లేదని కోపం వచ్చి వెళ్ళిపోయిందా?

రోజూ అన్నం సరిగా తినడం లేదని కోపం వచ్చిందా?

పలకా, బలపం, తీసుకొని అక్షరాలు దిద్దడం లేదని వెళ్ళిపోయిందా?

తనకు మంచి గౌనులు, వెండి పట్టాలు, బంగారు గాజులు, బంగారు గొలుసులు కొనిపెట్టమని పేచీ పెట్టింది. అందుకు కోపం వచ్చిందేమో.

నాకేమీ అక్కర్లేదని అమ్మతో చెప్పాలి.

అమ్మమాట చెప్పగానే వింటానని చెప్పాలి.

నాకు అమ్మ వుంటే చాలు.

కాని ఎలాగ?

అమ్మ నేను పెద్దయ్యేదాకా రాదుట కదా.

పాప ఇలాగ పరిపరి విధాలా ఆలోచిస్తోంది

శంకరరావు చనిపోయిన భార్య దగ్గర దుఃఖంతో, తన మూడు సంవత్సరాల దాంపత్యంలో. భార్య అందించిన మధుర సంఘటనలను తలుచుకుంటూ, ఆమె తలనిమురుతూ వేదన చెందుతున్నాడు.

ఆమె తల మీద చేయి వేయగానే తల కదిలినట్లయింది.

"అత్తయ్యా - రమ కదులుతూంది. చూడు నిజంగానే ......." అన్నాడు తన ప్రక్కనే వున్న మేనత్తతో.

ఆమె నవ్వలేక నవ్వుతూ-

' పిచ్చి నాయనా. చచ్చిపోయినోళ్ళు ఎలా కదుల్తారు. పిచ్చి భ్రమ. నీకు అలా అనిపిస్తోంది" అంది.

" అంతే నంటావా " అన్నారు శంకరం రమ గభాల్న లేచి నిలబడి " నేను చనిపోలేదండీ బ్రతికే వున్నాను " అని అంటే ఎలావుంటుంది? పిచ్చిశంకరం ఆలోచనలు అలా పరుగెడుతున్నాయి.

శంకరం ప్రక్కనే వున్న తన కూతుర్ని " శంకరం దగ్గరగా వెళ్ళి కళ్ళు తుడిచి వోదార్చు " అంటూ సైగలు చేస్తోంది. శంకరం మేనత్త. ఆమె కూతురికి ఇరవై ఐదు సంవత్సరాలు ఇంకా పెళ్ళికాలేదు. శంకరం చేసుకుంటాడేమోనని పెళ్ళి చేయలేదు. ఈలోగా శంకరానికి పెళ్ళయిపోయింది. "అలాగే" నువ్వెక్కాల్సిన రైలు జీవితకాలం లేటు " లాగా మిగిలిపోయింది. కాని రైలు మళ్ళీ వస్తుంటేమోనన్నట్లుగా తయారైంది ఆమె పరిస్థితి శంకరం భార్య పోవడంతో.

తన తల్లి " ఇదే మంచి అవకాశం. భార్య పోయింది. ఈ సమయంలో అతనికి దగ్గరైపోతే బావుంటుంది. ఎంత ప్రేమించిన భార్య అయినా సరే, అకస్మాత్తుగా చనిపోయిందంటే,

మగాడు ఆడవాసన లేకుండా జీవించలేడు. ఎలాగోలాగ బుట్టలో వేసుకో " అంటూ ఉదయం నుండే నస పెడుతోంది.

" ఎవరి గొడవ వాళ్ళది. ఊరు తగలబడిపోతుందంటే, తాటాకులు, నెదుళ్ళు, కలప ఖర్చు అవుతుందని వ్యాపారస్థులు సంబరపడినట్లుగా-

" బావా పోయినోళ్ళకోసం బాధపడితే ఏం లాభం చెప్పు ? చిన్ని చూడు బిక్కచచ్చిపోయి ఎలా మూలగా కూర్చుందో చూడు. ధైర్యం తెచ్చుకో. నువ్వే అలా అయిపోతే ఎలాగ? అని అతని చుబుకాన్ని పట్టుకొని తన చీర చెంగుతో కళ్ళు తుడుస్తూ అతనిపై ఇంతకు ముందు ఉన్న ప్రేమాభిమానాల్ని గుర్తుకు తెచ్చుకోసాగింది మణి.

" మణీ రమ చూడు నన్ను అన్యాయం చేసి వెళ్ళిపోయింది. నేనేం లోటు చేశాను. నామీద కోపం వచ్చి వెళ్ళిపోయింది. అంటూ ఆమె ఒడిలో తల పెట్టుకొని ఏడ్వసాగేడు.

" పిచ్చి బావా ! రాత్రి దాకా బాగానే వుంది కదా మన మేం చేస్తాం. నీ లోపం ఏం లేదు. సమయానికి అన్ని ఏర్పాట్లు చేశావు. చావు హఠాత్తుగా వస్తే నువ్వేం చేస్తావు. " అంటూ అతని తలను తన గుండెలకు హత్తుకుంటూ, తను ముందు ముందు పొందబోయే సౌఖ్యాలను తలచుకుంటూ, శంకరాన్ని పొదివి పట్టుకుంది.

ఈ దృశ్యం చూసి శంకరం మేనత్త పొంగిపోతుంది " పోనీలే ఛస్తే చచ్చింది. నా కూతురి జీవితం అయినా బాగుపడుతుంది ". అనుకుంటూంది.

రమ రాత్రి దాకా బాగానే వుంది తెల్లవారురుఝామున గుండెల్లో నొప్పి అంది. అంతలోనే " చిన్ని జాగ్రత్త. నన్ను మర్చిపోరుకదూ " అంటూ తల వాల్చేసింది.

చిన్ని ఏడుస్తూ, మధ్య మధ్యలో తన తండ్రి వేపు చూస్తోంది.

" నాన్న మణి ఒడిలో పడుకున్నాడేమిటి ఛీ. అమ్మ చచ్చిపోయిందంటున్నారు., అందరూకాని. అమ్మ చచ్చిపోలేదు. నిద్ర పోతూంది. నాన్నకి సిగ్గులేదు. నిద్రపోతున్న అమ్మ ఎదురుగా మణి ఒళ్ళో తలపెట్టుకొని పడుకున్నాడు-ఛీ.. సిగ్గులేని నాన్న –" అనుకుని చీదరించుకుంటుంది.

" చిన్నీ ఏమిటమ్మా ---" అన్నారు ఎవరో. ఛీ.. అనుకుంటున్న చిన్నితో.

" అటు చూడు. నాన్న వెకిలిగా మణి ఒళ్ళో తల పెట్టుకొని పడుకున్నాడో. సిగ్గుండాలా! " అంటూంది.

“ తప్పు చిన్ని - మణి నీకు పిన్ని వరసే. నిన్ను ఎవరు చూస్తారు? మీ అమ్మ అప్పుడే రాదు కదా. అందుకని మణి నీరెండో అమ్మ అనుకో. ఏమంటావ్ ”

“ ఛీ.. నాకు వద్దు నాకు మా అమ్మే కావాలి. ”

“ చిన్నీ. నా బంగారు కొండ. నీళ్ళు పోసుకుంటుంటేనే, నా చిన్ని బంగారంలా వుంటుంది”. అంటూ ఒళ్ళంతా సున్నిపిండితో రుద్దుతూ, అమ్మ ఆప్యాయపు స్పర్శతో, అభిమానపు చూపులతో ప్రేమతో నిండిన అమ్మ గుర్తుకు వచ్చింది చిన్నీకి.

“ నాకు అమ్మ కావాలి ” అంటూ ఏడ్వసాగింది. చిన్ని కళ్ళు వర్షిస్తున్నాయి కాని వేపు ఎవరూ చూడటం లేదు. అలాగే ఏడ్చి, ఏడ్చి నిద్రపోయింది చిన్ని.

* * *

చిన్ని నిద్ర లేచింది

ఎదురుగా మణి ఒడిలో తలపెట్టుకొని నాన్న.

“ ఛీ.. అనుకుంది.

“ చిన్నీ. ఇలా రావే తల్లీ ” అంటుంది మణి

“ నేను రాను - ” అంటూ బయట గదిలోకి వెళ్ళింది చిన్ని. అక్కడ పనిపిల్ల దిగులుగా కూర్చుని వుంది.

“ ఏమే. అమ్మ ఏదీ..” అంది పనిపిల్లతో చిన్ని.

“ మరేమో. మీ అమ్మ గార్ని శ్మశానంలో నువ్వు పెద్దయ్యేవరకూ నిద్రపోవడానికి, పెద్ద గొయ్యి తీసి, అందులో మంచం వేసి పడుకోబెట్టి వచ్చారు. తరువాత నువ్వు పెద్దయ్యాక “ మా చిన్ని పెద్దదయింది రమ్మని ” నిద్ర లేపి తీసుకువస్తారు” అంది పనిపిల్ల.

“ అలాగే. అయితే నేను అక్కడికి వెళ్ళవచ్చా - ”

“ వెళ్ళకూడదమ్మా. అక్కడ రాత్రిళ్ళు భయం వేస్తుంది ”.

“ మరి పగలు భయం వెయ్యదా? ”

“ అమ్మో పగలు కూడ వెళ్ళకూడదు ”

చిన్న పిల్లలు ప్రశ్నలకు జవాబులు చెప్పడం, వాళ్ళని ఆ జవాబును ఒప్పించడం

చాలా కష్టం.

" మరి అమ్మకు భయం వెయ్యదా? ".

" వెయ్యదు. పెద్దాళ్ళకు భయం వుండదు "

" అది సరేగాని, అమ్మ నిద్రపోవాలంటే నేను పెద్దయ్యేదాకా మనింట్లోనే పడుకోవచ్చుకదా ఎందుకు వెళ్ళాలి? "

" అది అంతే చిన్ని నీకు తెలియదు " పనిపిల్లకు అంతకన్నా చెప్పడం తెలియలేదు.

✸ ✸ ✸

రాత్రి ఏడయింది

అక్కడ కులమత విద్వేషాలు లేవు

బీదా గొప్పా లేదు

రాజు, పేద అనేది లేదు

అందరూ ఒక్కటే

ఒకరి ప్రక్కన మరొకరూ ప్రశాంతంగా నిద్రపోతుంటారు.

అది జాతి సమైక్యతకు ప్రతీక.

అది పగలు ప్రశాంత ప్రదేశం.

రాత్రిళ్ళు భయం కలిగించే ప్రదేశం

ఒకచోట రగులుతున్న కాష్టం.

మరోచోట ఆరిపోతున్న కాష్టం.

విచిత్రమైన మానవ కళేబరాల వాసన.

అక్కడక్కడ ఎముకలు, పుఱ్ఱెలు

మీసాల పాపయ్య వాడిపేరు.

అతను ఎంతమంది స్త్రీలనో, పురుషులనో, పసిపాపలనో, ముసలివాళ్ళనో, దహనం చేస్తుంటేనో, సమాధి చేస్తుంటేనో ఆ వీడ్కోలు దృశ్యాలు, హృదయాలు ముక్కలయ్యే దృశ్యాలు,

చూసి, చూసి గుండెలు రాయి చేసుకున్న వాడు.

రగులుతున్న కాష్టం వేపు, చూస్తున్నాడు.

మసి అయిపోతున్న ఆ తల్లికి

వంటినిండా బంగారం

పదివేలరూపాయల పట్టుచీరతో శ్మశానానికి తీసుకువచ్చారు.

ఆమె శవం కూడా వచ్చిన బంధువులంతా, ఇక్కడినుండి ఏ వస్తువూ ఇంటికి తీసుకువెళ్ళకూడదని అంటే, ఆమె భర్త " చాల్లే సంబరం ......" అంటూ కట్టెలంటించే ముందు మొత్తం వలిచేసి పట్టుకుని వెళ్ళిపోయారు.

పాపయ్య ఆలోచనలు ఆగిపోయాయి

అతని దృష్టి

ఎదురుగా

దూరంగా నిలబడి వున్న ఒక చిన్నారి మీద పడింది

పాపచేతిలో సంచీ.

పాపయ్య ఒక క్షణం భయపడ్డాడు.

ఒకవేళ ఏ పాపైనా దెయ్యమై కనిపిస్తోందేమోనని.

కాదు. నిజమే..

పాపయ్యలో కదలిక వచ్చింది.

ఈలోగా

పాపే తన దగ్గరకు వచ్చింది.

" తాతయ్య... మరి-

" పాపా. ఎందుకు వచ్చావు నాన్నా ఇక్కడికి పిల్లలు రాకూడదు..."

" మరేమో మా అమ్మను ఇక్కడ నిద్రపుచ్చారట కదా! "

" ఎవరమ్మా..."

" పొడుగ్గా, తెల్లగా, గిరజాల జుట్టుతో మా అమ్మ ఎంతో అందంగా ఉంటుంది.

సాయంత్రం మా అమ్మను ఇక్కడ పడుకోబెట్టారట కదా, నన్ను మా అమ్మ ప్రక్కనే పడుకోపెట్టవూ అమ్మ లేకుండా నేను వుండలేను అంటోంది పాప.

“ మీ అమ్మ ఇంక రాదు నాన్న దేముడి దగ్గరకు వెళ్ళిపోయింది ”

“ ఛీ..ఛో.. నువ్వు అబద్ధాలు చెబుతున్నావు. మా అమ్మ నిద్ర పోతూంది. నేను పెద్దయ్యాక వస్తుందిట ”

“ అలాగేనమ్మా. నా దగ్గర పడుకో. ఇంకొంచెం రాత్రి అయ్యేక మీ అమ్మ దగ్గర పడుకోపెడతాను ”

“ మంచి తాతయ్యవు. నీకు బహుమతి ఇస్తానులే. మా అమ్మ దగ్గర, నన్ను ఊరికే పడుకోపెట్టద్దు. “ అంటూ తన చేతికి వున్న బంగారు గాజులు ఇచ్చేసింది. పాపయ్యకు.

“ పాపా నీ పేరు...”

“ చిన్ని అంటారులే నన్ను

“ పాపా.. ఎందుకు అమ్మ దగ్గరకు వెళ్ళాలనుకుంటున్నావు. ఎలాగూ అమ్మ వస్తుంది కదా. ఇంట్లో నాన్నగారు లేరా? ”

“ ఛీ.. నాన్న మంచోడు కాదు. అమ్మ ఇప్పుడు నిద్ర పోతే మాత్రం, మణి ఒళ్ళో పడుకుని సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు మణి కూడా అంతే, మా నాన్న మీద పడిపోతోంది. దానికి సిగ్గులేదు.” అంటూ , కాళ్ళు చేతులూ తిప్పుకుంటూ చెప్తోంది.

“ మణి. ఎవరమ్మా ... ”

“ మా నాన్నగార్కి చుట్టాలమ్మాయట. నాకు చిరాకు. మా అమ్మే కావాలి నాకు ”

“ సర్లే. తల్లీ.. నా దగ్గర నిద్రపో కాస్సేపయ్యాక మీ అమ్మగారు పిలుస్తారు ” అంటూ పాపను తన ఒడిలోన పడుకోబెట్టుకుని జోకొట్టాడు. పాప నిద్ర పోయింది.

* * *

కాలింగ్ బెల్ మ్రోగింది

వీధి తలుపు తీశాడు శంకరం.

పాప ప్రక్క వాళ్ళింట్లో వుందని చెప్పింది తన మేనత్త

గేటు దగ్గర ఒక వ్యక్తి

అతని భుజంమీద పాప.

ఆ పాప, తన చిన్నారి చిన్ని.

ఇదేమిటి?

పరుగులతో గేటు దగ్గరకు వెళ్ళేడు

" ఏమిటిది .. నువ్వు...."

" బాబుగారూ, పాపమ్మగారు నడుచుకుంటూ అక్కడకు వచ్చేశారయ్యా ఆళ్ళ అమ్మగారి దగ్గర పడుకోపెట్టమని ఒకటే ఏడుపయ్యా..."

చిన్నిని తన భుజానికి మార్చుకుని, అదిమి పట్టుకున్నాడు తన గుండెలకు శంకరం

" అయ్యగారూ చిన్న మనవి.."

" చెప్పు. " జేబులో చెయ్యిపెట్టబోయాడు.

అతను అందుకు కాదని చేతులు ఊపుతూ

" మణి ఎవరయ్యా..."

" మా మేనత్త కూతురు "

" మణమ్మగార్ని ఒకవేళ తమరు పెళ్ళి చేసుకుంటారా "

" ఎందుకు? "

" పాపకు ఆమె అంటే చెడ్డ చిరాకు బాబూ. కాస్త పాపని జాగ్రత్తగా చూసుకొండయ్యా... వస్తా "

" పాపయ్య నా పాపను నాకు తెచ్చి ఇచ్చావు. నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో..."

" వద్దు లెండయ్యా.. మణి అమ్మగార్ని దూరంగా వుంచండి చాలు "

అంటూ పాపయ్య వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

శంకరం భుజం మీద చిన్ని

" అమ్మా..." అంటూ కలవరిస్తోంది.

" నా చిన్నారి కన్నా. నువ్వే కావాలిరా నాకు. నీ తోడిదే లోకం నాకు ఈ ప్రపంచంలో ఎవరూ అక్కరలేదు " అంటూ తనలో తాను గొణుక్కుంటూ లోనికి వెళ్తున్నాడు శంకరం.

***